## క్లుప్తంగా

### వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ


బత్తాయిల అలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు స్వామి వారిని బత్తాయి పండ్లతో ప్రత్యేకంగా అలకంరించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానంతరం భక్తులకు ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

### రీ-సర్వేపై వినతుల స్వీకరణ


రీసర్వేపై వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పెనుగొండ: మండలంలోని ములపర్రులో భూ రీ-సర్వే పూర్తి కావడంతో రైతుల వద్ద నుంచి వినతులు స్వీకరిస్తున్నారు. శనివారం పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో రైతులకు భూ సర్వే 9-2 నోటీసులు అందించారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తక్షణం సర్వేయరు, వీఆర్వోల వద్దకు వచ్చి సరిచేసుకోవాలని సూచించారు. దీంతో భూమి హెచ్చుతగ్గులపై దరఖాస్తులు అందించడానికి రైతులుబారులు తీరారు.

### అన్నదాత సుఖీభవ విడుదల చేయాలి


హరికుమార్

యలమంచిలి: కేంద్రంలోని బీజేపీ సర్కార్, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల కింద ఇస్తామన్న పెట్టుబడి సాయం నిధులను వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంద హరికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులను మోసం చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని విమర్శించారు. ఓట్ల కోసం ఎన్నికల ముందు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తరువాత వాటిని అమలు చేయకుండా కాలం వెళ్ల దీస్తున్నారని ధ్వజమెత్తారు. ఓ వైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి సాయం రైతుల ఖాతాలకు జమ చేయకపోవడం ఏంటి? అని ప్రశ్నించారు.

### తల్లికి వందనం ఓ నయ వంచన


సుంకర ఇందిర

పెనుగొండ: తల్లికి వందనం పేరుతో తల్లులను సీఎం చంద్రబాబు మోసం చేశారని, అర్హులైన చాలా మంది తల్లుల ఖాతాలకు నేటికీ సొమ్ములు జమ కాలేదని ఆచంట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా ఏడాది కాలం పాటు కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా, అరాచకపాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. కొంత మంది తల్లులకు తల్లికి వందనం పేరుతో రూ.8,500 మాత్రమే జమ చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంలో ఏమీ చేయకపోయినా, సూపరిపాలనకు తొలి అడుగు పేరుతో ఊరూరా తిరుగుతూ సొంత డబ్బా కొట్టుకుంటున్నారని విమర్శించారు.

### నేడు ఉమ్మడి జిల్లా స్వర్ణకార సంఘ సమావేశం

ఆకివీడు: ఉమ్మడి జిల్లా స్వర్ణకార సంఘం విస్తృత స్థాయి సమావేశం స్థానిక రైస్ మిల్లర్స్ భవనంలో ఆదివారం నిర్వహిస్తామని జిల్లా సంఘ అధ్యక్షులు పట్నాల శేషగిరిరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో స్వర్ణకార వృత్తిలో విశిష్ట సేవలందించిన వారికి అత్యుత్తమ ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. స్వర్ణవృత్తి పరిరక్షణపై, బ్యాంకు అప్రయిజర్స్ సమస్యలపై చర్చిస్తామని స్పష్టం చేశారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఫీజుల బకాయిల పేరుతో విద్యార్థులకు కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పక్కనబెడుతుందని మండిపడ్డారు.

# గ్రామీణ విద్యార్థులకు ప్రాథమిక విద్య దూరం


పెనుమంట్ర గరువు ఎలిమెంటరీ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులతో ఉపాధ్యాయురాలు, ఆయా


మాముడూరు ఆర్ మోడల్ స్కూల్‌లో రెండు తరగతులను ఒకే గదిలో నిర్వహిస్తున్న దృశ్యం

- మోడల్ స్కూల్స్ పేరుతో పాఠశాలల వీలీనం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

పెనుమంట్ర: కూటమి ప్రభుత్వ అస్తవ్యస్త నిర్ణయాలతో ప్రాథమిక విద్య దూరం అవుతుందని విద్యావేత్తలు ఆరోపిస్తున్నారు. మోడల్ స్కూల్స్ పేరుతో తీసుకొచ్చిన వ్యవస్థ వల్ల గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు మూతపడుతున్నాయని ఆరోపిస్తున్నారు. మండలంలో 18 గ్రామాల్లో 48 ప్రభుత్వ పాఠశాల ఉండగా అందులో 38 ఎలిమెంటరీ పాఠశాలలు, కొత్తగా ఏర్పాటు చేసిన నెలమూరు, సోమరాజు ఎల్లిందలపర్రు హైస్కూల్స్ తో పాటు 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో 2996 మంది విద్యార్థులు ఉండగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 1171 మంది, 6 నుంచి 10 వరకు 1825 మంది విద్యార్థులు ఉన్నారు. 38 ఎలిమెంటరీ పాఠశాలలో ఇప్పటికే కోయేటిపాడు స్పెషల్, నాగళ్ల దిబ్బ, పెనుమంట్ర పెద్ద చెరువు గట్టు ఎంపీపీ పాఠశాలలను మూసివేశారు. అయితే ముగ్గురేసి విద్యార్థులున్న సత్యవరం (ఆర్),వెలగల వారి పాలెం (ఆర్), పంపన వారి పాలెం, సచివరం (ఎస్టీ) నలుగురు విద్యార్థులు ఉన్న ఓడూరు స్పెషల్, పెనుమంట్ర గరువు, ఆలమూరు లోనికోమటి చెరువు, ఐదుగురు విద్యార్థులు ఉన్న చిట్టిమట్ల గరువు (మాముడూరు), బ్రాహ్మణ చెరువు లోని సూర్యారావుపేట మూసివేత దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ 48 పాఠశాలల్లో గత ఏడాది 3150 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది ఆ సంఖ్య 2996 మందికి చేరుకుంది.

**ప్రైవేట్ పాఠశాలల జోరు**

మండలంలో ప్రైవేట్ పాఠశాల విషయానికి వస్తే గత ఏడాది మండలంలో 18 పాఠశాలలకు గాను 3435 మంది విద్యార్థులు ఉండగా ఏడాది మాముడూరులో ఒక ప్రైవేట్ పాఠశాలను మూసివేశారు. అంటే దాదాపు 17 ప్రైవేట్ పాఠశాలల్లో 3298 మంది విద్యార్థులు ఉన్నారు. ఇంకా అనేకమంది మండలానికి చెందిన విద్యార్థులు తణుకు, భీమవరం ,పాలకొల్లు పట్టణాల్లోని కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలకు ప్రతిరోజు బస్సుల్లో వెళ్లి విద్యాభ్యాసం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది.

**ఇరుకు గదుల్లో తరగతులు**

మోడల్ స్కూల్స్ పేరుతో పెనుమంట్ర (ఆర్), మాముడూరు ( ఆర్ ), బ్రాహ్మణ చెరువు (ఆర్) వంటి పలు పాఠశాలల్లో ఆయా గ్రామాల్లో సమీపంలో ఉన్న ఎలిమెంటరీ పాఠశాలలోని మూడు నాలుగు ఐదు తరగతులను విలీనం చేయడంతో ఆయా పాఠశాలలో చాలీచాలని ఇరుకు గదుల్లో 70 నుంచి 80 మంది పిల్లలకు నలుగురు నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాల్సి వస్తుంది. అలాగే విద్యార్థులు మధ్యాహ్నం భోజనాన్ని ఇరుకు తరగతి గదిలోనే నేలపై కూర్చుని చేయాల్సి వస్తుంది.

**అధికారుల తీరు వివాదాస్పదం**


పెనుమంట్ర ఆర్ మోడల్ స్కూల్లో పెచ్చులూడుతున్న గదిలో విద్యాబోధన చేస్తున్న దృశ్యం

కూటమి నాయకుల పైరవీలకు తలొగ్గిన విద్యాశాఖ అధికారులు పెనుమంట్ర, ఓడూరు, నెలమూరు తదితర గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతిధులను సంప్రదించకుండా విద్యా కమిటీ సభ్యులను పక్కదారి పట్టించి తప్పుడు తీర్మానాలతో పాఠశాల వీలినాన్ని చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో పాఠశాలల మూసివేతకు దారి తీయడమే కాక మోడల్ స్కూల్స్‌లో తగినన్ని సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## తల్లిదండ్రులే తొలి గురువులు


తల్లిదండ్రులను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

పెనుగొండ: విద్యార్థులకు తల్లిదండ్రులే తొలి గురువులని పెనుగొండ ఎస్వీకేపీ అండ పితాని వెంకన్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ అన్నారు. జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా శనివారం పెనుగొండ కళాశాలలో 2025వ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇంటర్మీడియట్ విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులను ప్రోత్సహించడానికే తల్లిదండ్రుల దినోత్సం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్, కె.సోనీ కుమారి, ఎస్.మీరాషరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లను రైతులు వ్యతిరేకించాలి


పెనుమంట్రలో నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు

పెనుమంట్ర: కేంద్రంలో మోదీ ప్రభుత్వం చెప్పిందల్లా కూటమి చేస్తుందని, రైతుల పంపుసెట్లకు ఆదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా నాయకులు ఆకుల హరే రామ్ అన్నారు. శనివారం స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకిస్తూ పెనుమంట్రలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా ఆదానీ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇప్పటి మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను బద్దలుకొట్టాలంటూ పిలుపునిచ్చి, అధికారంలోకి వచ్చాక మళ్లీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు పూనుకోవడం ఏంటి? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పెనుమంట్ర మండల కార్యదర్శి కె.ప్రసాద్, సీపీఎం నాయకులు బి.విజయకుమార్, తూటే సురేష్, పిల్లి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి ఉప్పొంగుతున్న గోదావరి


సిద్ధాంతం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

పెనుగొండ: ఎగువ నుంచి వరద నీరు ఉధృతంగా వస్తుండడంతో పెనుగొండ, ఆచంట మండలాల్లో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇప్పటికే రెండు సార్లు పెరిగిన గోదావరి శనివారం ఉదయం నుంచి మరోసారి ఉప్పొంగి ప్రవహిస్తుంది. గోదావరి ఉధృతితో సిద్ధాంతం, నడిపూడి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురంలో పుష్కర ఘాట్లు నీటి మునిగాయి. మరో రెండు మూడు రోజుల పాటు గోదావరి ఉధృతి మరింత పెరగవచ్చనని అంచనా వేస్తున్నారు. దీంతో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

## మడ అడవులు తీరప్రాంతానికి రక్షణ కవచం


విద్యార్థులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారి కరుణాకర్

నరసాపురం: మడ అడవులు తీరప్రాంతానికి రక్షణ కవచమని భీమవరం అటవీక్షేత్ర అధికారి మురాల కరుణాకర్ అన్నారు. అంతర్జాతీయ మడ సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రుస్తుంబాధ మున్సిపల్ హైస్కూల్ వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో మాట్లాడారు. తీరం వెంబడి మడ అడవులు ఉండటం వల్ల ప్రకృతి విపత్తుల సమయంలో రక్షణగా నిలుస్తాయని చెప్పారు. అలాగే మడ అడవుల కారణంగా ప్రకృతికి సహకరించే అనేక జీవరాశులు వృద్ధి చెందుతాయన్నారు. విద్యార్థులు మడ అడవుల ప్రత్యేకతను తెలుసుకుని వాటి సంరక్షణకు పూనుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.సురేష్‌కుమార్, బీట్ ఆఫీసర్ కె.రాం ప్రసాద్, టి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పాలకొల్లులో కార్గిల్ విజయ్ దివస్

పాలకొల్లు సెంట్రల్: మన కన్న తల్లి ఎంత ముఖ్యమో? దేశంలో కూడా అంతే ముఖ్యమని అలాంటి దేశాన్ని కాపాడుకోవాల్సిన భాధ్యత మనందరిపైన ఉందని హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీప్రసాద్ మాట్లాడుతూ 1999 మేలో పాకిస్తాన్ సైనికులు, ఉగ్రవాదులు కార్గిల్ ద్వారా భారత భూ భాగంలోకి అడుగుపెట్టారని అన్నారు. దీంతో భారత ఆర్మీ ఆపరేషన్ విజయ్‌తో విరుచుకుపడి దాయాది సైనికులను కార్గిల్ నుంచి తరిమికొట్టిందన్నారు. నాటి నుంచి జులై 26న కార్గిల్ విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు జాతీయ జెండాలను పట్టుకుని విజయ్ దివస్ సందర్భంగా జై భారత్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.త్రిమూర్తులు, శశికళ, కరణం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అవధానంలో ఉమామహేశ్వరరావు ప్రతిభ


ఉమామహేశ్వరరావు

పాలకొల్లు సెంట్రల్: అత్తిలి మండలం బల్లిపాడు గ్రామానికి చెందిన యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు చిన్న వ్యవసాయ కుటుంబం నుంచి అవధానిగా నిలిచాడు. పదో తరగతి అనంతరం తిరుపతి వెళ్లి సంస్కృత వ్యాకరణ శాస్త్రం ఆచార్య (ఎంఏ) రాష్ట్రీయ సాంస్కృతిక విశ్వ విద్యాలయం తిరుపతిలో పూర్తి చేశారు. ప్రస్తుతం విద్యావారిధి (పీహెచ్‌డీ) చేస్తున్నారు. విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో తాత్విక బాలవికాస్‌లో భాగంగా చిన్ననాటి నుంచి అనేక ఆధ్యాత్మిక అంశాలపై ఉపన్యాసాలు చెప్పి పీఠాధిపతులు ఉమర్ ఆలీషా ఆశీస్సులు పొందారు. ఇప్పటి వరకూ తిరుపతితో పాటు ఉభయ రాష్ట్రాల్లో, కర్ణాటకలోను ఇప్పటి వరకూ 37 గీతావధానాలు, 20 సాహిత్య అష్టావధానాలు చేశారు. అయితే ఉమామహేశ్వరరావు సోమవారం పట్టణంలో జరగనున్న అష్టావధాన కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

## వాటర్ గ్రిడ్ పనులకు శంకుస్థాపన

పెనుగొండ: మండలంలోని వడలిలో రూ.198.42 కోట్లతో వాటర్ గ్రిడ్ పనులకు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్, స్టాంపులు శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్య ప్రసాద్ మాట్లాడుతూ జల్‌జీవన్ మెషిన్ ద్వారా వడలి గ్రామం నుంచి సుమారు 14 గ్రామాలకు గోదావరి స్వచ్ఛ జలాలను సరఫరా చేయవచ్చనని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తోట సీతామహాలక్ష్మి, రామరాజు, ఉప్పల సురేష్ బాబు, అంగర రామ మోహన్‌రావు పాల్గొన్నారు.

## మానసిక వైద్యశాలల పరిశీలన


వైద్య సదుపాయాలపై ఆరా తీస్తున్న న్యాయమూర్తి హనీషా

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.హనీషా శనివారం టూటౌన్ లోని శాంతి, ప్రశాంతి, వర్మ మానసిక వైద్యశాలలను సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి, వారి మానసిక స్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి న్యాయపరంగా ఎటువంటి సలహాలు, సూచనలు అవసరమైనా మండల న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో మానసిక వైద్యులు జీవీ.రమణరావు, మాదిరెడ్డి వెంకటరమణ, శ్రీదేవి, ఉచిత న్యాయవాదులు పి.అంబేడ్కర్, ఎన్.సుధీర్, మీడియేషన్ న్యాయవాది కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయబద్ధంగానే ఫీల్డ్ కౌన్సిల్ ఎన్నిక

ఆకివీడు: ఈస్ట్ ఆకివీడు బాప్టిస్టు ఫీల్డ్ కౌన్సిల్ ఎన్నిక న్యాయబద్ధంగానే జరిగిందని, ఒకరిద్దరు చేస్తున్న అసత్య ప్రచారం తగదని నూతనంగా ఏర్పడిన ఫీల్డ్ కౌన్సిల్ కమిటీ పేర్కొంది. ఈ మేరకు శనివారం స్థానిక ఉల్వర్టన్ పేట చర్చి ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు కుర్రెళ్ల రవి ప్రకాష్ మాట్లాడుతూ గత రెండేళ్లగా ఫీల్డ్ కౌన్సిల్ కమిటీ ఎన్నికలు జరగకపోవడంతో కార్యాకలాపాలు స్థంభించాయన్నారు. ఇటీవల సిద్ధాపురం గ్రామంలోని చర్చిలో 10 సంఘాల సభ్యులు సమావేశమై చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారని చెప్పారు. మరో రెండు సంఘాల సభ్యులు హాజరుకాలేదన్నారు. వారికి కూడా నూతన కమిటీలో ప్రాతినిధ్యం కల్పిస్తామని చెప్పారు. త్వరలోనే నూతన కమిటీ పూర్తి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశంలో కార్యదర్శి జీ.జోసఫ్‌రాజు, కోశాధికారి సుందర సింగ్, సభ్యులు బొద్దు వజ్రం, మండా ఏసు పాల్గొన్నారు.

## చిన్నారుల భవిష్యత్‌కు అంగన్‌వాడీ విద్య పునాది


మహదేవపట్నంలో ఈసీసీఈ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: అంగన్‌వాడీల్లో చిన్నారులకు అందించే విద్య వారి భవిష్యత్‌కు పునాది వంటిదని సీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మీ అన్నారు. శనివారం ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డే(ఈసీసీఈ) సందర్భంగా మహదేవపట్నం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని శ్రీలక్ష్మీ, సీడీపీఓ వాణీ విజయరత్నం ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మీ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్‌ను అద్భుతంగా తీర్చిదిద్ది వారి జీవితానికి దారి చూపించేలా అంగన్‌వాడీ కేంద్రాలు నిలుస్తున్నాయని అన్నారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు.

## గొల్లవానితిప్పలో పిచ్చికుక్క స్వైర విహారం

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో శనివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి తొమ్మిది మందిని కరిచి గాయపరిచిందని గ్రామస్తులు తెలిపారు. ఉదయం స్కూల్‌కు వెళ్తున్న ఇద్దరు విద్యార్థులు, ఏడుగురు పెద్దలు, ఒక ఆవును కరవడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాబిస్ వ్యాక్సిన్‌ను వేయించుకున్నారు. ఆ పిచ్చికుక్క ఎవరిని కరుస్తుందోనని గ్రామస్తులు భయాందోళనలు చెందారు. వీధికుక్కలు మందలుగా తిరుగుతూ భయపెడుతున్నాయని అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## ప్రతి పాఠ్యాంశంపై పట్టు అవసరం

తణుకు అర్బన్: ప్రతి పాఠ్యాంశంపై పట్టు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఇంటర్మీడియేట్ జిల్లా విద్యాశాఖాధికారి జి.ప్రభాకర్ అన్నారు. తణుకు ఎస్వీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ సంస్కరణలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఏపీ ఇంటర్మీడియేట్ విద్యామండలి ప్రవేశపెట్టిన విద్యావిధానం, సిలబస్ మార్పులు, కొత్త సబ్జెక్ట్స్ కాంబినేషన్స్‌తో పాటు అదనపు సబ్జెక్టుల ఎంపికలో విద్యార్థులు సరైన దిశగా వెళ్లేలా కృషి చేయాలని సూచించారు.

## డీఎస్పీ మృతితో పాలకొల్లులో విషాదఛాయలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన డీఎస్పీ మేకా చక్రధరరావు (51) విధి నిర్వహణలో భాగంగా విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తూ శనివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పట్టణంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన మృతిపై పట్టణ రాజకీయ ప్రముఖులు, పోలీసు అధికారులు, మిత్రులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేశారు. శనివారం రాత్రికే ఆయన మృతదేహం పాలకొల్లు తీసుకువస్తున్నట్లు బంధువులు తెలిపారు.

## హిందీ అధ్యాపకుడి కోసం దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హిందీ సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపకుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. హిందీ ఎంఏ చదివి 55 శాతం అంతకు మించి అర్హత ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 29న కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలు కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

## సైబర్ నేరగాళ్లపై అప్రమత్తత అవసరం

పెనుగొండ: ప్రస్తుత తరుణంలో సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆచంట ఎస్సై కట్టా వెంకట రమణ అన్నారు. శనివారం ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరగాళ్లపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సోషలమీడియా పోస్టుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామం శివారు ప్రాంతంలో శుక్రవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసినట్లు నరసాపురం రూరల్ ఎస్సై టి.వెంకట సురేశ్ శనివారం విలేకరులకు తెలిపారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని వివరించారు. వారి వద్ద నుంచి రూ.3,400 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు.

## ఏఎంసీ త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం

పెనుమంట్ర: స్థానిక వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా పెనుమంట్రకు చెందిన జవ్వాది సురేష్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ సభ్యులుగా గరువు గ్రామానికి చెందిన సత్తి సత్యానందరెడ్డి, మల్లిపూడి గ్రామానికి చెందిన పొన్నమండ విజయనరేష్ ప్రమాణ స్వీకారం చేశారు. గతంలో 3వేల మంది సభ్యులు ఉన్న ఈసొసైటీలో ప్రస్తుతం 100 మంది మాత్రమే అర్హతగల సభ్యులు ఉన్నారు.

## కళాకారుడు కర్రా సత్యనారాయణ మృతి

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన కళాకారుడు, సినీ నటుడు కర్రా సత్యనారాయణ (75) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. సత్యనారాయణ రచయిత, నటుడు. అనేక నాటికలకు దర్శకత్వం వహించారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సత్యనారాయణ మృతిపై మాజీ ఎంపీపీచేగొండి హరిరామజోగయ్య, సినీ రచయిత వీరా పోతన, పట్టణ కళాపరిషత్ సభ్యులు తమ సంతాపాన్ని వ్యక్తంచేశారు.